ఎరుకల సంక్షేమానికి సహకారం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎరుకల అలయ్ బలాయ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): ఎరుకల కులస్థుల సంక్షేమానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో తెలుగు రాష్ట్రాల ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలాయ్‌లో సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల కులస్థులు అన్ని రంగాల్లో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు నల్గొండ శ్రీనివాస్, వెలుగు నాగార్జున, శేఖర్, శ్యామల, రాజు, వెంకట్రాములు, జగదీష్, వెంకటయ్య పాల్గొన్నారు.



జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

జనప్రియ క్వార్టర్స్‌లో జిమ్ ప్రారంభం

కొత్తపేట, మే 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ జనప్రియ క్వార్టర్స్‌లో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. జనప్రియ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఔట్‌డోర్ జిమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ దీపాల ఏర్పాటుకు పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రహరీ నిర్మాణ సమస్యను దూరం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఔట్‌డోర్ జిమ్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో క్వార్టర్స్ అధ్యక్షుడు స్వామి, ప్రతినిధులు మహేశ్వర్‌రావు, మల్లేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్, నాయకులు సుందర్‌నారాయణ, తోట మహేందర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వనస్థలిపురం, మే 25(ఆంధ్రజ్యోతి): డివిజన్ సమస్యల పరిష్కారమే ధ్యేయమని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమం లో భాగంగా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దళిత శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

శ్మశానవాటికకు మౌలిక సదుపాయాలు కల్పిస్తా

హయత్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ఎస్సీ శ్మశానవాటికను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న పనులకు త్వరలో ఎస్టిమేషన్ వేయించి పూర్తి చేయిస్తానని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు పెండింగులో పడుతున్నాయని అన్నారు. స్నానాల గదులు, నీటి సౌకర్యం, మూత్రశాలలు, గేటు, హైమాస్‌లైట్లు, మరమ్మతులు చేయిస్తానని అన్నారు. శ్మశానవాటికలో విద్యుత్ దహన వాటిక ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు కోదండ సూరి, సత్యనారాయణ, లక్ష్మీదాసు, నర్సింహ, జంగయ్య, ముత్యాలు, వెంకటేశ్ పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌గుప్తాను గజమాలతో సన్మానిస్తున్న కార్యవర్గ ప్రతినిధులు


వాసవీకాలనీ సంక్షేమ సంఘం ఏకగ్రీవం

ఎల్‌బీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవీకాలనీ నివాసుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం కాలనీలోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2025-2028 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా అయిత అంజయ్య గుప్తా, కోశాధికారిగా కృష్ణయ్య మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, లక్ష్మయ్య, మనోహర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా గౌరీశంకర్, డాక్టర్ వి. రాంకిషన్, టి. శ్రీధర్, సంయుక్త కోశాధికారిగా దండు రాజు, కార్యవర్గసభ్యులుగా చిలుక ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ కే.బాలరాజు, జయరాం, కళ్యాణ్, లచ్చన్న, మల్లారెడ్డి, మల్లికార్జునరావు, ప్రకాష్‌రావు, కేఆర్‌కే ప్రసాద్, రామయ్య, వి. శ్రీనివాసులు, శ్రీకాంత్‌తో పాటు 20మంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి. సుభాకర్‌రావు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చే యించి ధ్రువపత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశామన్నారు.

అద్భుతంగా భరతనాట్య అరంగేట్రం

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): సురభి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ భరతనాట్య గురువు వినీత శ్రీనందన్ శిష్యులు ధృతి సుహానీ, ఆరాధ, అద్వైత, కృషి భరతనాట్య అరంగేట్రం చేశారు. ఈ ప్రదర్శన ఆదివారం త్యాగరాయ గానసభలో అద్భుతంగా జరిగింది. గురువు వినీత, కృష్ణన్‌తో కలిసి నట్టువాంగం చేయగా సురేష్‌బాబు గాత్రసహకారం అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత గ్రామం పాల్వంచకు చెందిన నలుగురు బాలికలు భరతనాట్యంలో శిక్షణ పొంది తొలి ప్రదర్శనలోనే తమ ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు.

వేయని రోడ్డుకు బిల్లులు చెల్లించారు!



సింగరేణి వాంబేకాలనీలో వేయని రోడ్డు

- తప్పు కప్పి పుచ్చుకునేందుకు రాత్రి రోడ్డు వేసే యత్నం
- అడ్డుకున్న బస్తీవాసులు, నేతలు

సైదాబాద్, మే 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబేకాలనీలో వేయని రోడ్డు వేసినట్లు చూపారు.. ఇంజనీరింగ్ అధికారులు ఎంబీ రికార్డులు చేసి బిల్లులు చెల్లించారు. కానీ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి శుక్రవారం పూర్తి ఆధారాలతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు కాంట్రాక్టర్, అధికారులు కలిసి చేసిన దందా వెలుగులోకి వచ్చింది. కమిషనర్ విచారణకు ఆదేశించడంతో సంతోష్‌నగర్ డివిజన్ సర్కిల్-7 ఇంజనీరింగ్ అధికారులు తప్పులు కప్పి పుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఆదరాబాదరగా శనివారం రాత్రి యంత్రాలు, సిబ్బందితో బదిలీపై వెళ్లిన అప్పటి ఏఈ అన్సారీ వచ్చి సీసీ రోడ్డు వేసే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బస్తీవాసులు, బీజేపీ నేతలు అక్కడకు చేరుకుని పనులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు. ప్రస్తుత ఏఈకి సమాచారం ఇవ్వకుండా బదిలీపై వెళ్లిన అధికారి పని మొదలుపెట్టడం గమనార్హం. వివాదంగా మారిన సింగరేణి వాంబేకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.9.90లక్షల నిధులు మంజూరు చేసి 2024 ఆగస్టు 24న టెండర్లు పిలిచారు. ఈ పనిని ఖాన్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు దక్కించుకుంది.



రోడ్డు వేసేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ అధికారులు

లక్ష్మీనగర్‌కాలనీ పార్కు నిధుల సంగతేమిటి..

లక్ష్మీనగర్‌కాలనీ పార్కు మరమ్మతుల కోసం గతేడాది ఆగస్టులోనే రూ.2లక్షల నిధులు మంజూరు చేసి మహ్మద్ అబ్దుల్ మాలిక్ కాంట్రాక్టర్‌కు టెండర్ ద్వారా అప్పగించారు. కానీ నేటి వరకు పైసా పని జరగలేదని కాలనీవాసులు చెబుతున్నారు. కానీ ఈ నిధులు సైతం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పూర్తి విచారణ జరపాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు

సీసీ రోడ్డు వేసినట్లుగా తప్పుడు రికార్డులతో అక్రమంగా బిల్లులు కాజేసిన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీ. శ్రీకాంత్‌రెడ్డి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజాధనం అక్రమంగా కాజేసిన అధికారులపై ఏసీబీ కేసు నమోదు చేయాలని కోరారు.

ప్రత్యేక బృందంతో తనిఖీలు నిర్వహించాలి



ఐఎస్ సదన్ డివిజన్‌తో, యాఖుత్‌పురా నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనుల నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. కమిషనర్ స్పందించి నాలుగేళ్లుగా జరిగిన నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ ప్రత్యేక బృందంతో తనిఖీలు నిర్వహించాలి. అవినీతిపై పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి ప్రజాధనాన్ని స్వాధీనం చేసుకోవాలి.

- జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కార్పొరేటర్, ఐఎస్‌సదన్

విజిలెన్స్ విచారణ చేపట్టాలి



డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులు చేయకుండానే నిధులు దుర్వినియోగం చేశారు. వీరికి సహకరించిన ఉన్నతాధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు జరపాలి. పనులపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- షేక్ మహమూద్, సీపీఐ డివిజన్ కార్యదర్శి

బోధన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకే శిక్షణ

చాదర్‌ఘాట్, మే 25(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అధునాతన పద్ధతిలో బోధించేందుకు అవసరమైన బోధన సామర్థ్యాలను మరింత పదును పెట్టేందుకే ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ సిటీ మోడల్ హైస్కూల్‌లో కోర్సు డైరెక్టర్ నర్సరాజు, మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ వరప్రసాద్‌ల పర్యవేక్షణలో బుధవారం నుంచి శనివారం వరకు జరిగిన ఉపాధ్యాయుల 5రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల విచ్చేశారు. రాబోయే రోజుల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు బోధనలో కూడా డిజిటల్ బోధనలు చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే సూచించారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో భాగంగా బేసిక్స్, లెర్నింగ్, ఇంప్రూవ్, క్రియేటివ్‌లపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. వచ్చే నూతన విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు తప్పనిసరిగా కంప్యూటర్ విద్యను తప్పనిసరిచేసేలా మార్పులు వస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. అదేవిధంగా టెక్నాలజీకి అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకువచ్చేలా రాను న్న రోజుల్లో విద్యార్థులకు డిజిటల్ బోధనలు చేసేలా కూడా శిక్షణ కార్యక్రమాల్లో వివరించారన్నారు. ఆర్పీలు ఇందిర, ప్రవీణ్ భాను, కుసుమ, సుజాత, సుబ్బలక్ష్మి, సుభాషిణి, హెప్‌సిబా, ఉదయ్‌బాబులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ 19వ డివిజన్‌లోని లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను ఆదివారం ఆయన అందజేశారు. అనంతరం పలువురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ఆ దిశలో అన్ని చర్యలూ తీసుకుంటున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని చల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, మాజీ కార్పొరేటర్లు బైగల్ల బాలమణి, చల్లా కవితాబాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ సిద్దాల దశరథ, నాయకులు కుమార్, వెంకటేశ్, పరశురాం, శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఐ. భాస్కర్, మాదరి శ్రీనివాస్, యాదయ్య, ఓంప్రకాశ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



జిల్లెలగూడలో మహిళా లబ్ధిదారుకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేస్తున్న టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి

కొత్తపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతర పోరాటం కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి తెలిపారు. న్యూనాగోల్‌లోని ప్రజా సంఘాల భవనం ఎస్ఏ డాంగే భవన్‌లో ఆదివారం సీపీఐ భరత్‌నగర్ శాఖ సమావేశం సీనియర్ నాయకుడు, మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆందోజు రవీంద్రాచారి ముఖ్య అతిథిగా పాలొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్, భరత్‌నగర్, లెనిన్‌నగర్, ఫత్తుల్లగూడ, ఎన్‌టీఆర్‌నగర్, నాంచారమ్మనగర్ తదితర బస్తీల్లో సమస్యల పరిష్కారానికి సీపీఐ శాఖ కార్యవర్గ సభ్యులు, నాయకులు ముందుకు రావాలన్నారు. ఇటీవల కర్రెగుట్టలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను అందరూ ఖండించాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడం మాని అమాయక గిరిజనులను, ఆదివాసులనూ పట్టుకొచ్చి చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కర్రెగుట్ట, పరిసరాల్లో ఖనిజ సంపదను పెట్టుబడి దారులకు కట్టబెట్టేందుకు పర్యావరణానికి హానితలపెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. జూన్ 28న నిర్వహించనున్న సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వీరభోగ వసంతరాయలు



వీరభోగ వసంతరాయలు ప్రజాపతికి నియామకపత్రం అందజేస్తున్న దుర్గారావు

ఎల్‌బీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సామాజిక కార్యకర్త డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతి నియమితులయ్యారు. ఆదివారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగెందర్‌లు వీరభోగ వసంతరాయలు ప్రజాపతికి నియామక పత్రం అందజేశారు. బీసీ సమాజం అన్ని రంగాల్లో ఎదుగుదలకు దోహదపడేలా బీసీ ఫెడరేషన్ కుల సమితి కార్యాచరణ సాగుతుందన్నారు. నూతన నాయకత్వంతో బీసీ ఫెడరేషన్ కులాల సమితి మరింత బలపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి అధికార ప్రతినిధి భాస్కరుడు, కోశాధికారి పసుపులేటి కర్ణాకర్, ఉపాధ్యక్షుడు రాణా నగేష్‌సింగ్, సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోగుల స్వామి, ఎల్బీనగర్ నియోజకవర్గ సభ్యులు దీకొండ గోపాల్ మహేంద్ర పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్

సరూర్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట్‌లోని బాలాజీనగర్‌కు చెందిన ఎస్.శ్రీకాంత్-కవిత భార్యాభర్తలు. వారికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. శ్రీకాంత్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొంత కాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండడంతో ఏడాది క్రితం భార్య కవిత తన ముగ్గురు పిల్లలను తీసుకుని గజ్వేల్‌లోని కేసారంలో గల పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పుడప్పుడూ శ్రీకాంత్ అక్కడకు వెళ్లి వచ్చేవాడు. కాగా వారం రోజుల క్రితం ఎప్పటిలాగే శ్రీకాంత్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి నర్సమ్మతో పాటు బంధువులు ఎక్కడ వెతికినా శ్రీకాంత్ జాడ తెలియకపోగా, అత్తింటికి కూడా వెళ్లలేదని తెలిసింది. దాంతో నర్సమ్మ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ చెప్పారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తూ డివైడర్‌కు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన హబ్సిగూడలోని ఫైర్ స్టేషన్ వద్ద ఆదివారం జరిగింది. ఓయూ పోలీసులు, తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. అల్లడ్డబావి, మెట్టుగూడ ప్రాంతానికి చెందిన ఎ.అనిల్, పుష్పవల్లి దంపతుల కొడుకు ఎ.మాధవన్(21) తన బైక్‌పై ఉదయం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరాడు. ఉప్పల్ నుంచి తిరిగి వస్తుండగా హబ్సిగూడలోని ఫైర్ స్టేషన్ ఎదురుగా పిల్లర్ నెంబర్ 1002 యూ టర్న్ సమీపంలో అతివేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన అతన్ని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అతను మృతి చెందినట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దళితులకు ఉన్న ఎకరం గుంజుకుంటారా?

- కొహెడాలో ఎక్ సాల్ పట్టా రైతుల ఆక్రందన
- భూమికి భూమి ఇవ్వాల్సిందే

హయత్‌నగర్, మే 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుల హయాంలో ఇచ్చిన ఏక్ సాల్ పట్టా భూములను గుంజుకుంటారా అని కొహెడాకు చెందిన పలువురు దళిత, బీసీ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తమకు ఆధారంగా ఉన్న ఒక్క ఎకరం భూమి కూడా లాగేసుకుంటే తాము ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. గుట్ట రాళ్లను తమకు అప్పగిస్తే 40సంవత్సరాలుగా రాళ్లు, రప్పలను తొలగించి చదును చేసుకుని వర్షాధారిత పంటలను పండించుకుంటున్న తమను ఎక్కడికి వెళ్లమంటున్నారని బాధిత రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారుల వేధింపులు భరించలేక పోతున్నామని బాధిత రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. భూమి వద్దకు రమ్మంటున్నారు. రాకుండా అధికారులు తప్పించుకు తిరుగుతున్నారని తెలిపారు. కూలీ పనులు మానుకుని తాము వస్తే సమయం లేదు.. మీరే కార్యాలయానికి రండీ అని తహసీల్దార్ తిప్పలు పెడుతున్నారని బాధితులు తెలిపారు. 1985 ప్రాంతంలో ఏక్ సాల్ పట్టాలు పొందిన కొహెడా గ్రామానికి చెందిన రైతులు ఆదివారం సదరు భూమి వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ల హయాంలో కొహెడా గ్రామానికి చెందిన సుమారు 200 మంది ఎస్సీ, బీసీ, ఎస్టీలకు ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 167/1లో ఏక్ సాల్ పట్టాలను అందించారని తెలిపారు. దీంతో తాము గుట్ట రాళ్లను తొలగించుకుని చదును చేసుకుని వర్షం కురిసినప్పుడు పునాస పంటలను పండించుకుంటు జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి తాము భూమికి పన్నులు కూడా కడుతున్నామంటూ పన్ను రసీదులు చూపించారు. తమకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా తమకు తెలియకుండానే 2008లో మా సాగు భూములను దిల్ కంపెనీకి ఇచ్చారని తెలిసింది. అయినా ఇప్పటికి తామే కబ్జాలో ఉండి సాగు చేస్తున్నామని దళిత రైతులు తెలిపారు. ఇదెక్కడి న్యాయం దళితులకు ఉన్న ఒక్క ఎకరం కూడా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. నెల రోజుల క్రితం మా భూముల చుట్టు ప్రహరీ నిర్మించడానికి అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ, హౌసింగ్ అధికారులు వచ్చి పనులు చేస్తుంటే అడ్డుకున్నామని తెలిపారు. తమకు భూమికి భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంత వరకు తాము భూమిని వదిలేదు లేదని అన్నారు. హనుమాన్ జయంతి నాడు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తమను భూమి వద్దకు రమ్మన్నాడు. దీంతో తామంత పనులు మానుకుని భూమి వద్దకు వచ్చామని తెలిపారు. తహసీల్దార్ ఇక్కడికి రాకుండా ఆర్డీవోతో కలిసి కోహెడా గుట్టపైన ఉన్న ఆలయానికి వెళ్లి ఫొటోలు దిగుతున్నాడని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని దళితుల సాగు భూములను లాక్కోవద్దని కోరుతున్నారు. సమావేశంలో బాధిత రైతులు బుడ్డ భిక్షపతి, కొత్త పోచయ్య, సాదు పెంటయ్య, సత్తయ్య, కందాళ భల్‌దేవ్‌రెడ్డి, గంగని రంగయ్య, ఈదయ్య, ఐలయ్య, చినింగి యాదమ్మ పాల్గొన్నారు.



కొహెడాలోని సర్వే నంబర్ 167/1లో సమావేశమై నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు